క్లుప్తంగా

స్నేహితుడికి ఆర్థిక సాయం



అనారోగ్యంతో వున్న వీరేష్‌కు ఆర్థిక సహాయం అందిస్తున్న స్నేహితులు

ఎమ్మిగనూరుటౌన్: క్యాన్సర్‌తో బాధపడుతున్న స్నేహితుడికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. పట్టణంలోని నలందా కాలేజీలో 2011–2013లో ఇంటర్మీడియెట్ చదువుకున్న వీరేష్ ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో మంచానికి పరిమితం కావడంతో నాడు చదువులు చెప్పిన అధ్యాపకుడు మద్దిలేటి స్పందించి పూర్వ విద్యార్థులతో కలిసి రూ.25వేలు పోగు చేశాడు. ఈ నగదును ఆదివారం బాధితుడి ఇంటికి వెళ్లి పూర్వవిద్యార్థులతో కలిసి అందజేశారు. దాదాపు రూ.8లక్షలతో కీమోథెరపీ తదితర చికిత్సలు చేయిస్తే వ్యాధి నయమవుతుందని వైద్యులు చెప్పారని తల్లిదండ్రులు తెలిపారన్నారు. దాతలు స్పందించి మెరుగైన చికిత్స అందించే ఏర్పాటు చేసి తమ స్నేహితుడి ప్రాణాలు కాపాడాలని వారు కోరారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న దృశ్యం

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లకు చెందిన బోయ రమేష్ జనవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. 2006–07లో పదవ తరగతి రమేష్‌తో పాటు గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సాయంత్రం అతని స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.90వేలు రమేష్ భార్య సుజాతకు అందజేశారు. రమేష్ కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఇమ్రాన్ బాషా, మనోహర్ రెడ్డి, అల్లబకాష్, కడియాల వెంకటేశ్వర్లు, నగిరి షబ్బీర్, చాంద్‌బాషా, షేక్షావలి, మహబూబ్, సలీం, బొగ్గు రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

'పూల సజ్జ' పుస్తకావిష్కరణ

పెద్దకడబూరు : మండల పరిధిలోని కంబదహాల్ జిల్లా ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న బాల సాహిత్య వేత్త బాలబంధు డాక్టర్ గద్వాల సోమన్న 67వ పుస్తకం పూలసజ్జ ఆవిష్కరణ చేపట్టారు. ఆదివారం వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో పుట్టపర్తి నారాయణ చార్యులు శాఖ గ్రంథాలయంలో ఆవిష్కరణ చేపట్టారు. ఆ సంస్థ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డి.కె. చదువుల బాబు, వేంపల్లి షరీఫ్, దాదా హయాత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనతి కాలంలో 67 పుస్తకాలు రచించిన గద్వాల సోమన్నను సత్కరించారు.

రైల్వే ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు



ఎల్‌సీ గేట్ వద్ద అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: రైల్వే ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ బి. మల్లేశ్వరయ్య హెచ్చరించారు. ఆదోని రైల్వే స్టేషన్ ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐగా బి. మల్లేశ్వరయ్య ఆదివారం బాధ్యతలను చేపట్టారు. అనంతరం రైల్వే స్టేషన్లోనూ, కోసిగి ఎల్‌సీ గేటు వద్ద ప్రయాణికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైళ్ల వెళ్లనప్పుడు రాళ్లు విసిరినా, రైల్వేకి సంబంధించిన వస్తువులను దొంగతనం చేసినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. గేట్లు వేసినపుడు స్కూటర్లను గేట్ కింద నుంచి తీసుకొని వెళ్లడం వంటి పనులను చేయకూడదన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి



బ్రాంచ్ ప్రారంభోత్సవంలో పీఠాధిపతి

మంత్రాలయం : భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి మరింత ఆదరణ పొందాలని శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అన్నారు. ఆదివారం శ్రీమఠం ఎదురుగా కారిడార్‌లో నిర్మించిన బ్రాంచ్‌ను పీఠాధిపతి చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఠాధిపతికి ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసుల శెట్టి పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. చల్లా శ్రీనివాస శెట్టి దంపతులను పీఠాధిపతి శేషవస్త్రం, ఫలమంత్రాక్షితలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ శ్రీనివాసు, డీటీఎం గులాటి, మేనేజర్ రాజశేఖర్, ఫీల్డు ఆఫీసర్ రామచంద్ర నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉజ్వల భవితకు కోర్సుల ఎంపికే కీలకం

- జూనియర్ కళాశాలల్లో ప్రారంభమైన ఇంటర్ అడ్మిషన్లు
- ఇంటర్‌లో గ్రూప్‌ల ఎంపికపై విద్యార్థుల్లో సందిగ్ధత
- ఇష్టమైన సబ్జెక్టులకు ప్రాధాన్యతనివ్వాలంటున్న నిపుణులు
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాల్సిన సమయం



ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

ఎమ్మిగనూరుటౌన్: జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయాయి. ఇంటర్మీడియెట్‌లో ఏగ్రూపు తీసుకోవాలి, ఏగ్రూపు తీసుకుంటే భవిష్యత్ బాగుంటుంది. ఎవరిని అడగాలి అనే సందేహాలతో సతమవుతుండటం సహజం. పదవ తరగతి ఉత్తీర్ణులైన వారికి ఉన్నత విద్యకు వారధి ఇంటర్మీడియెట్. ఇందులో గ్రూపు ఎంపిక అత్యంత కీలకమైన అంశం. ఇష్టమైన సబ్జెక్ట్‌లను ఎంచుకోవడానికి ప్రాధాన్యత నివ్వాలని, అందుకోసం ప్రణాళికబద్ధంగా చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకోవడానికి సులభతరమవుతుందని అధ్యాపకులు, విద్యావంతులు సూచిస్తున్నారు.

ఏ కోర్సులో ఏముంది?

పట్టణంలో బాలుర, బాలికల కళాశాలతో పాటు బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయి. అలాగే ఓ ప్రైవేటు ఐటీఐ కళాశాల ఉంది. ఇంటర్మీడియెట్ చదవాలనుకునే విద్యార్థులు ఏగ్రూపులో చేరితే ఏ సబ్జెక్ట్‌లుంటాయి.. తదనంతరం ఆయా గ్రూపుల్లో ఉత్తీర్ణులైతే ఎలాంటి కొలువులు లభిస్తాయి అన్న అంశాల గురించి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్లు తెలిపిన మేరకు వివరాలు.

బైపీసీ..: ఇందులో బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. ఎంసెట్, నీట్ పరీక్షల ద్వారా డాక్టర్, వైద్య సంబంధిత వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలనుకునేవారికి బైపీసీ గ్రూపు ఎంతో ఉపకరిస్తుంది. అదేవిధంగా అగ్రికల్చర్ కోర్సులకు ఈ గ్రూపు ప్రతిపాదిక. ఒపిగ్గా చదడం, స్పష్టంగా సైన్స్ ప్రతిపాదికన బొమ్మలు వేయడం లాంటివి ఈ గ్రూపు విద్యార్థులకుండాల్సిన లక్షణం.

ఎంపీసీ : ఇందులో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. ఇంజనీరింగ్‌లో స్థిరపడాలనుకునే వారు తీసుకునేవారు ఈ గ్రూపు తీసుకోవచ్చు. ఎంసెట్ రాయలనుకున్నా, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, ఎరోనాటికల్స్ తదితర రంగాల్లో ఇంజినీరింగ్ చేయాలనుకున్న వారికి ఈగ్రూపు పునాదిలాంటిది.

ఎంఈసీ, సీఈసీ: ఈ గ్రూపు సేవారంగం వైపు వెళ్లే వారు తీసుకోవచ్చు. మ్యాథ్స్, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్ట్‌లు ఈగ్రూపులో వుంటాయి. చార్టెడ్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు, కమర్షియల్ ఏజెంట్లు, బ్యాంక్‌లలో పలు విభాగాల్లో ఉద్యోగాలు పొందాలను కుంటే ఈ గ్రూపు ఎంతో ఉపకరిస్తుంది. స్టాక్‌మార్కెట్‌లలో ఉద్యోగాలు పొందాలనుకునే వారు కూడా ఈ గ్రూపులను తీసుకోవచ్చు.

ఐటీఐ : ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ కోర్సులను ఎంచుకోవడం ద్వారా విద్యార్థులు పదవ తరగతి తరువాత రెండేళ్ల సాంకేతిక విద్యలో నైపుణ్యత పొందవచ్చు. ఎలక్ట్రికల్, డీజిల్ మెకానిక్ తదితర కోర్స్‌లు పూర్తయిన వెంటనే ఉపాధి పొందే అవకాశం వుంది. పరిస్థితులు అనుకూలిస్తే సాంకేతిక విద్యారంగంలో ఉన్నత స్థాయి కోర్సులు చదివే అవకాశం వుంది.

పాలిటెక్నిక్ : పదవ తరగతి తరువాత ఏదైనా సాంకేతిక విద్యలో నైపుణ్యం సంపాదించాలంటే ఉత్తమ మార్గం పాలిటెక్నిక్ చదువే. ఇందుకోసం విద్యార్థులు పాలిటెక్నిక్‌లో ఎంట్రెన్స్‌లో ఉత్తీర్ణత సాధించాలి. మెరిట్‌పైనే ఇందులో సీట్లు వస్తాయి.

ఇష్టమైన గ్రూపులను ఎంచుకోవాలి



మా కళాశాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలున్నాయి. పది తరువాత విద్యార్థులు ఇంటర్మీడియెట్ చదువుకు గాను తమకు ఇష్టమైన గ్రూపులను ఎంచుకోవాలి. భవిష్యతులో ఏం చేయాలనుకుంటున్నారో నిర్ణయం తీసుకొని.. అదే లక్ష్యంతో కోర్సులను ఎంపిక చేసుకొని చదవాలి. ఏది పడితే అది, ఒకరిని చూసి మరోకరు పోటీపడి కోర్సులను ఎంపిక చేసుకొని కెరియర్‌ను పాడుచేసుకోకూడదు. ఇష్టమైన సబ్జెక్ట్‌లను ఎంచుకొని అందులో రాణించాలి. మా కళాశాలలో అన్ని గ్రూపులున్నాయి. బాలికలు ఆయా గ్రూపుల్లో చేరేందుకు ప్రస్తుతం దరఖాస్తులను స్వీకరిస్తున్నాం . అన్ని గ్రూపులకు విద్యార్థినులు ఎంతమందైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

– విజయరాణి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఎమ్మిగనూరు

పట్టణ ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు

పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 85 శాతం ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరంలో 82 శాతం ఉత్తీర్ణులయ్యారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 258 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 220 మంది పాస్ అయ్యారు. అదేవిధంగా మొదటి సంవత్సరంలో 301 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 248 మంది ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా స్థానిక బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 102 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 71 మంది ఉత్తీర్ణులుకావడంతో 69 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. మొదటి సంవత్సరంలో 155మందికి గాను 64 మంది ఉత్తీర్ణులు కావడంతో 41శాతం ఉత్తీర్ణత శాతం వచ్చింది.

రైతాంగానికి అండగా వైఎస్సార్‌సీపీ



బహుమతులను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి



బండి గిరికలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎర్రకోట రాజీవ్‌రెడ్డి, ఎంపీపీ కేశన్న

ఎమ్మిగనూరుటౌన్: రైతులకు అన్ని విధాలుగా అండగా వుండి పరిపాలన సాగించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు ఎర్రకోట రాజీవ్‌రెడ్డి, ఎంపీపీ కేశన్న అన్నారు. మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి మహ రథోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న అంతర్‌రాష్ట్ర ఎద్దుల బండి గిరక లాగుడు పోటీలను ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో నియోజకవర్గంలో రైతులకు మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సాగు నీటి విషయంలో ఎల్లప్పుడు అండగా వుండి రైతుబాంధవుడుగా పేరొందారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారెప్ప, పార్టీ నాయకులు దయాకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

ఎమ్మిగనూరు మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం, జాతర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్ రాష్ట్ర గిరక బండి పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో విజేతలకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి రూ.25వేలు గుడికల్ మారెప్ప, రెండవ బహుమతి రూ.20వేలు హాలహర్వి వెంకటేష్, మూడవ బహుమతి రూ.15వేలు గుడికల్ చాకలి దస్తగిరి, నాల్గవ బహుమతి రూ.10వేలు గుడికల్ డీఎస్ బుల్స్, ఐదవ బహుమతి రూ.5వేలను దేవనకొండ మండలం మాచాపురం గ్రామానికి చెందిన సురేంద్రకు చెందిన ఎద్దులు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న, సర్పంచ్ మారెప్ప, దయాకర్ రెడ్డి, నాగ భూషణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



బుట్టాఫౌండేషన్ అధినేత శివనీలకంఠను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ పట్టణ నూతన కమిటీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతానికి కొత్తగా నియామకమైన పార్టీ పట్టణ కమిటీ కృషి చేయాలని బుట్టా ఫౌండేషన్ అధినేత, పార్టీ నాయకుడు బుట్టా శివనీలకంఠ సూచించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కమిటీలో తమకు స్థానం కల్పించినందుకు గాను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనను కమిటీ సభ్యులు సత్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుకకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహులు, పట్టణ కార్యదర్శి కొరిశెట్టి విశ్వనాథ్, పార్టీ రాష్ట్ర రైతు సంఘ అధికార ప్రతినిధి గడ్డం నారాయణ రెడ్డి, రాష్ట్ర బీసీసెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నజీర్‌అహమ్మద్, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రబాడులో ఎద్దుల బలప్రదర్శన పోటీలు



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి

గోనెగండ్ల : మండలంలోని ఎర్రబాడు గ్రామంలో అంపయ్య పౌర్ణమిని పురస్కరించుకొని చెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామ శివారులో రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి, చెన్నకేశవస్వామి దేవాలయం చైర్మన్ శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాముడు, శ్రీరామ్ రెడ్డి పోటీలను ప్రారంభించారు. పోటీలకు 12 జతలు హాజరయ్యాయి. ఇందులో మల్యాల గ్రామానికి చెందిన షేక్ మైమూన్‌కు చెందిన ఎద్దులు ప్రథమ బహుమతి రూ.65వేలు, రెండవ బహుమతిని తాడిపత్రి వృషభాలు రూ.45వేలు, మూడవ బహుమతిని హెచ్. కైరవాడి వృషభాల యాజమానులకు రూ.35వేలు, మిగతా ఆరు జట్లకు కూడా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రబాడు రాముడు, శ్రీరామ్ రెడ్డి, దేవేంద్రరెడ్డి, ప్రభాకర్ నాయుడు, శివరామిరెడ్డి, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గిరక బండి లాగుతున్న ఎద్దులు

హోరాహోరీగా ఎద్దుల గిరక బండి పోటీలు

నందవరం : పాంపాపతి స్వామి జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు ఎద్దుల బండి గిరక పోటీలు నిర్వహించారు. పోటీల్లో నందవరం గ్రామానికి చెందిన 11 జతల ఎద్దులు హోరాహోరీగా తలబడ్డాయి. అందులో దేవళ్ల ఆంజనేయులు ఎద్లు మొదటి సాథనంలో నిలిలువగా చాకలి మల్లేష్ ఎద్దులు రెండవ, తనగల పెద్ద నరసింహులు ఎద్దులు మూడవ స్థానంలో నిలిచాయి. డ్రైవర్ రాముడు ఎద్లు నాల్గవ స్థానం, తెలుగు నరసన్న ఎద్దులు ఐదవ స్థానం దక్కించుకున్నాయి. గెలిచిన ఎద్దుల యజమానులకు గ్రామ పెద్దలు రూ.5,116, రూ.3,116, రూ.2,116, రూ.1,500, రూ,1,500 చొప్పున నగదు బహుమతులను అందజేశారు.

సంక్షిప్తం

హాస్టల్‌లో మెనూ పాటించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు విష్ణు, ఖాదర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక హాస్టల్‌ను సందర్శించి, విద్యార్థులను మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ పెరిగిన ధరల కనుగుణంగా మెస్ చార్జీలను ప్రభుత్వం పెంచాలన్నారు. హాస్టళ్లలో విద్యార్థులకు సన్నబియ్యం సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రమేష్, రవి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జార్జిరెడ్డి వర్ధంతి సభలను విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేసిన విద్యార్థి సంఘ నాయకుడు జార్జి రెడ్డి వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీవైఎల్ డివిజన్ కన్వీనర్ మునెప్ప పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జార్జిరెడ్డి వర్ధంతి సభల పోస్టర్లను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 20వ వరకు నిర్వహించే దేశ వ్యాప్త వర్ధంతి సభల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు ప్రభు, జాన్, బాలు, అనీల్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

ఆదోని అర్బన్: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్రాహ్మణ సామాజికవర్గానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సమాఖ్య పురోహిత విభాగం అధ్యక్షులు గరుడాద్రి వెంకట దత్తాత్రేయశర్మ కోరారు. ఆదివారం విజయవాడలో రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిశారు. పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. బ్రాహ్మణ యువకులకు అర్హతను బట్టి రవాణా క్రీడా యువజనశాఖలలో ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. స్పందించిన మంత్రి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

బాబు బిందేశ్వరిప్రసాద్ మండల్‌కు నివాళి

ఆదోని టౌన్: ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో బాబు బిందేశ్వరిప్రసాద్ మండల్ 43వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు, నాయకులు ఢణాపురం శేషన్న, కత్తి హనుమంతరావు, తాలూకా గౌరవ సలహాదారులు వీరభద్ర, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో పర్యాటక అభివృద్ధి సంస్థ డైరెక్టర్

మంత్రాలయం : రాఘవేంద్ర స్వామి దర్శించుకునేందుకు ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ డైరెక్టర్ గంటా స్వరూప దేవి ఆదివారం రాత్రి మంత్రాలయం వచ్చారు. వీరు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. వీరితో పాటు జనసేనా నేత చల్లా వరుణ్, ఉన్నారు.

కుళాయి పైప్‌లు పగలకొట్టిన వారిపై కేసు నమోదు

పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుళాయి పైప్‌లైన్‌లను గుర్తు తెలియని వ్యక్తులు పగలకొట్టారని ఎస్‌ఐ నిరంజన్ రెడ్డి ఆదివారం తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శేషన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కస్తూర్బాలో వందశాతం ఉత్తీర్ణత

కోసిగి : మండల కేంద్రం కోసిగిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్మిడియెట్ ఫలితాల్లో మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ షబానా అజ్మీ తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో ఒకేషనల్ పీఎస్‌టీటీ గ్రూపులో ఫస్ట్ ఇయర్‌లో 19 మంది, ద్వితీయ సంవత్సరంలో 11 మంది పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారని చెప్పారు. ఇందులో ఎస్ రాణి 879/1000 , పి. మహాలక్ష్మి 858 /1000, ఫస్ట్ ఇయర్‌లో బి. హమాసా 480 /500 మార్కులు సాధించారన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ఆదోని సెంట్రల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆరెకల్లు గ్రామంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలకు ఆదివారం పరీక్షలను నిర్వహించారు. 5వ తరగతిలో ప్రవేశాలకు 1,063 మంది పరీక్షలు రాయగా, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు 747 మంది విద్యార్థిని విద్యార్థులు పరీక్షలను రాసినట్లు అబ్జర్వర్ మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 5వ తరగతిలోని ప్రవేశాలకు, మధ్యాహ్నం ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు పరీక్షలు జరిగినట్లు వారు తెలిపారు.

వైభవంగా భీరలింగేశ్వర స్వామి పల్లకోత్సవం



ఊరేగింపుగా వెళ్తున్న వివిధ గ్రామాల పల్లకీలు, పూజారి మల్లయ్య స్వామి



స్వామి వారిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో వెలసిన కురుబ కులస్తుల ఆరాధ్య దైవం భీరలింగేశ్వర స్వామి దేవరను పురస్కరించుకొని ఆదివారం పల్లకోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి పూజారి మల్లయ్య స్వామి నేతృత్వంలో ఆలయంలో వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకు పూజ, ఫలపుష్పాలతో అలంకరణలు గావించి ప్రత్యేక పూజలు చేపట్టారు. దేవరకు వివిధ ప్రాంతాల నుంచి 7 పల్లకీలలో వివిధ రూపాలలో స్వామి వారి ఉత్సవ మూర్తులను కోసిగికి తీసుకొచ్చారు. అందులో కోసిగి జడే మల్లయ్య స్వామి, కర్ణాటక ప్రాంతానికి చెందిన ఉప్పళ కరిలింగేశ్వర స్వామి, కుప్పగల్లు కొణిగి నూరప్ప స్వామి, మనేకుర్తి అయ్యళ్లప్ప స్వామి, గట్టుబిచ్చాలి కుణిషప్ప స్వామి, కుంభళ మల్లయ్య స్వామి, పర్వతాపురం అయ్యళ్లప్ప స్వామిల పల్లకీలు శనివారం రాత్రి కోసిగికి చేరుకున్నాయి. ఆదివారం ఉదయం 10గంటల నుంచి ఆయా గ్రామాల పల్లకీలను స్థానిక భీరప్ప స్వామి ఆలయం నుంచి గొరవయ్య నృత్యం చేస్తు డోళ్లు వాయిద్యాలు, కళశాలతో పురవీధుల గుండా ఊరేగించారు.

ఉత్సవాలకు ఎమ్మెల్యే విరాళం

ఉత్సవాలకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, ఆయన తనయుడు యువనేత వై. ధరణీధర్ రెడ్డి ఉత్సవాలకు రూ.20వేలు విరాళంగా అందజేశారు. ఈ నగదును మురళీ మోహన్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తాయన్న, పెద్దమూకప్ప, పెద్ద మల్లయ్య, ఈరన్న, నరసింహులు, గుడిసె శివన్న, వెంకటేష్, మల్లయ్య, గోవిందప్ప, చిన్న మహాదేవా, చిర్తపల్లి నరసింహులు వివిధ గ్రామాల నాయకులు, కురుబ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ఘనంగా జేలా వేడుకలు



దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పిస్తున్న ధర్మకర్త, భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో జేలా కార్యక్రమం ఆదివారం సాయంత్రం రాత్రి వరకు ఘనంగా దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. తెల్లవారు జామున ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. ప్రతి సంవత్సర లాగే ఈసంవత్సరం కూడా స్వామి ఉరుసుకు నెల ముందుగా ఈ జేలా వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. జేలా కార్యక్రమాన్ని 1881 నుంచి దర్గా ఆరవ పీఠాధిపతి సయ్యద్‌షా బాఖార్‌వలి చిష్తి నిర్వహిస్తున్నట్లు ప్రస్తుత పీఠాధిపతి తెలిపారు. గ్రామంలో కలరా, మశూచి వంటి రోగాలు, ప్రకృతి వైపరీత్యాలైన అధిక వర్షాలు, కరువు కాటకాల నుంచి ప్రజలు బయటపడాలని అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సాయంత్రం స్వామి వారి చిత్రపటంతో పాటు పూలతో కూడిన జేలాను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గుల్షన్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఖాజాపీర్ చిష్తీ, కర్ణాటకలోని సర్మస్‌వలి దర్గా నిర్వహకుడు సయ్యద్ దూద్‌బాషా, ఖాదర్‌లింగ శిష్య బృందం, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.



పక్కీర్ల విన్యాసాలు

ఘనంగా మట్టల ఆదివారం



మంత్రాలయంలో మట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని పలు చర్చీల్లో మట్టల ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని రాయనగర్ సి.ఆర్ చర్చిలో పాస్టర్ తిమోతి, విక్టోరియా పేటలోని సీఎస్ఐ చర్చి పాస్టర్ విలియం సుజిత్ ఆధ్వర్యంలో పిల్లలు, పెద్దలు మట్టలను చేత పట్టుకొని పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ప్రభువు నామాన్ని స్తుతించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్‌సీఎం చర్చి రెవరెండ్ ఫాదర్ కోలా విజయరాజు ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టలను చేత పట్టుకొని సెయింట్ జోసఫ్ పాఠశాల నుంచి ప్రధాన రహదారి, కూడళ్ల వరకు ర్యాలీగా వెళ్లి చర్చికి చేరుకున్నారు.

మంత్రాలయంలో మట్టలతో ఊరేగింపు

మంత్రాలయం : మంత్రాలయం మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చిలో మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని ఫాస్టర్ రెవరెండ్ వేదనాయకం ఆధ్వర్యంలో మట్టల ప్రదర్శనను నిర్వహించారు. చర్చిలో తెల్లవారుజామున నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మట్టలతో ఎస్సీ కాలనీలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు యోబు, సుందర రాజు, దేవదాసు, ప్రభుదాసు, కుమార్, కయ్యూన్, తదితరులు పాల్గొన్నారు.



ఆదోనిలో మట్టలు చేతబూని ఊరేగింపుగా సాగుతున్న క్రైస్తవులు